క్లుప్తంగా

ఘనంగా రాకడ పండగ



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కడియం: పొట్టిలంక గ్రామంలో సెయింట్ దేవదాస్ పెనుయేల్బైబిల్ మిషన్ ప్రధాన మందిరం ఏసు క్రీస్తూ రెండో రాకడ పండగ రెవరెండ్ చిక్కాల పాల్ దొరబాబు నిర్వహణలో బుధవారం ఘనంగా జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన బైబిల్ మిషన్ దైవజనులు రెవరెండ్ స్టీఫన్ రాజ్ క్రీస్తు ఆగమనం గురించి ఉపదేశమిచ్చారు. రెవరెండ్ డాక్టర్ రత్నరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా ఏసు క్రీస్తూ మాటలతో భక్తి శ్రద్ధలతో జీవించాలని వాక్యం అందించారు. అరుణపాల్, స్వరూపపాల్, చిరంజీవి, బేబీ దొర, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని జీఎస్ఆర్ ఫౌండేషన్, ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్‌బ్యాంక్‌లో బుధవారం రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది రక్తదానం చేశారు. జీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంకులో సుమారు 50 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారన్నారు. రక్తదానం చేసిన దాతలను డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి డాక్టర్ వెంకట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈవో పీఆర్అండ్ఆర్డీ పి.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శులు గుంట్రువెంకటరావు, ఎస్.శ్రీనివాసరెడ్డి, జి.కాశీవిశ్వనాథ్, డి.సూరిబాబు, తాడికృష్ణ, పి.రాధకృష్ణ, చెరుకూరిరాణి, శకుంతల, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు కొంతమూరు విద్యార్థి



విద్యార్థులతో పీడీ సుజాత

రాజమహేంద్రవరం రూరల్: నెల్లూరు జిల్లా దర్గామిట్టలో నిర్వహించిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో అండర్–17 బాలురు, అండర్–14 బాలురు తూర్పు గోదావరి జిల్లా టీమ్ చాంపియన్‌షిప్‌ను కొంతమూరుకు చెందిన ఎస్కే ఆజీస్ సాధించాడు. అండర్–17 బాలుర విభాగంలో కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్కే ఆజీస్ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. ఆజీస్‌ను పీడీ టి.సుజాతను పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.రత్నకళ, ఉపాధ్యాయులు అభినందించారు.

గోదావరి స్నానానికి వెళ్లి..



ముత్యాల మైఖేల్ మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి స్నానానికి వెళ్లి నీటిలో మునిగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం పుష్కరాలరేవులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తాడితోట రెల్లిపేటకు చెందిన ముత్యాల మైకేల్(35) నగరపాలక సంస్థ ట్రాక్టర్ డ్రైవర్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం సమయంలో పుష్కరాల రేవులో స్నానం చేద్దామని నీటిలో దిగాడు. నీటిలో ఒక్కసారిగా మునిగిపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. మైకేల్ భార్య ముత్యాల శ్రావణి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సినిమాలు

శ్యామల	: బఘీర
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: లక్కీ భాస్కర్
శివజ్యోతి	: క
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: అమరన్
రంభ	: భూల్‌భులాయియా–3
ఊర్వశి	: అమరన్
మేనక	: విశ్వం
కుమారి	: దేవర
అప్సర నామవరం	: లక్కీ భాస్కర్
విఎస్.మహల్ ధవళేశ్వరం	: లక్కీ భాస్కర్, క
మురళీకృష్ణ కడియం	: లక్కీ భాస్కర్
వెంకటసూర్య	: లక్కీ భాస్కర్

ట్రాఫిక్ టెన్షన్..

- నగరంలో ఇరుకు రోడ్లతో కష్టాలు
- రహదార్లపైనే వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



దేవీచౌక్‌లో అస్తవ్యస్త వాహనాలతో ప్రయాణికుల ఇబ్బందులు

సీటీఆర్ఐ: జిల్లాలో రాజమహేంద్రవరం ప్రధాన వాణిజ్య కేంద్రం కావడంతో వ్యాపారాల నిమిత్తం ఇక్కడకు అనేక మంది వస్తూ పోతూ ఉంటారు. వ్యాపార సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు, ఆసుపత్రులు, హోటళ్లు, చిరు వ్యాపారాలు, కొనుగోలుదారులతో నగరం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. నగరంలో అసలే ఇరుకు రోడ్లు, దీనికి తోడు పార్కింగ్ సమస్యతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయి.

అడ్డదిడ్డంగా పార్కింగ్

నగరంలో కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, మెయిన్‌రోడ్డు శ్యామలా సెంటర్, దానవాయిపేట, ప్రకాశం నగర్, తిలక్‌రోడ్డు, తాడితోట, వంటి వాణిజ్య కేంద్రాలున్న చోట ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళలో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే టెన్షన్ పడాల్సి వస్తోంది. రోడ్డు పక్కన టీ తాగడానికి, పానీపూరి తినడానికి, చెరకు రసం తాగడానికి కొంత మంది తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో అక్కడ వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ప్రైవేట్ ఆసుపత్రులు నగరంలో వందలాదిగా ఉన్నాయి. వీటికి సెల్లార్‌లో పార్కింగ్ ఇవ్వాల్సి ఉండగా వాహనాలను ఆసుపత్రి బయట పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆయా ఏరియాలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది.

నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నల్స్

నగరంలో నాలుగు కూడళ్ల ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ని ఏర్పాటు చేశారు. కాని కొన్ని చోట్ల అవి నామమాత్రంగానే ఉన్నాయి. నాలుగు రోడ్ల సెంటర్‌లో సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ఎవరికి తోచిన రీతిలో వారు అడ్డదిడ్డంగా వాహనాలను నడుపుతున్నారు. దీంతో అక్కడ గందరగోళం ఏర్పడి ఎవరు ఎటు వెళ్లుతున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది. నందంగన్నిరాజు జంక్షన్, వైజంక్షన్, ఆర్ట్స్ కళాశాల, గోకవరం బస్టాండ్ వద్ద, బిజిలీ జంక్షన్, క్వారీ మార్కెట్ సెంటర్ తదితర చోట్ల అస్సలు సిగ్నల్స్ లేవు.

ఇష్టానుసారంగా పార్కింగ్



రోజు రోజుకు జనాభాతోపాటు వాహనాల సంఖ్య పెరుగుతోంది. వాహనదారులు కూడా బాధ్యతగా వ్యవహరించాలి. ఇష్టానుసారంగా పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. దీనివల్ల అనేక సమస్యలు ఎదుర్కొవలసి వస్తోంది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించాలి.

– చుక్కల తులసీరామ్, స్థానికుడు

ఇతరులతో పోటీ పడకుండా..



విదేశాలలో బైక్‌లు పార్కింగ్‌కి ఒక జోన్, మనుషులు నడవడానికి ఒక జోన్ ఉంటుంది. కాని ఇక్కడ రోడ్లు ఇరుకుగా ఉండడం, సిటీ బాగా విస్తరించడం వల్ల రద్దీ పెరుగుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ లేని చోట మనమే కొంచెం క్రమశిక్షణతో ఇరత వాహనాలతో పోటీ పడకుండా జాగ్రత్తలు పాటిస్తే ట్రాఫిక్‌ని అదుపు చేసుకోవచ్చు.

– దారపు నాగిరెడ్డి, సైకాలజిస్ట్

జాతీయ స్థాయి విలు విద్య పోటీలకు గురుకులం విద్యార్థి



మోనిషాను అభినందిస్తున్న తుమ్మిడి అరుణ్‌కుమార్, శ్యాంసుందర్ తదితరులు

రాజమహేంద్రవరం: క్రీడలతో చదువులో ఏకాగ్రత పెంచుకోవచ్చని వ్యాపారవేత్త తుమ్మిడి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల మన్యం జిల్లా పార్వతీపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 68వ ఏపీ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలువిద్య పోటీల్లో రాజమహేంద్రవరం శ్రీ సత్యసాయి గురుకులం విద్యార్థిని వర్రే మోనిషా రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా మోనిషాను ఆయన అభినందించారు. అనంతరం శ్రీసత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు తదితర అంశాల్లో ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఈ నెల చివర గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీలకు వర్రే మౌనిషా రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. కార్యక్రమంలో గురుకులం కమిటీ సభ్యులు సోమసుందర్ రెడ్డి, లైయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరామగుప్త తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా, ప్రజా సంఘాల డిమాండ్



కడియంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

కడియం: మండలంలోని బుర్రిలంకలో వివాహిత మహిళపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, శ్రామిక మహిళా, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం స్థానిక బస్టాండ్ నుంచి దేవీ చౌక్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి మాట్లాడుతూ నర్సరీలో పనిచేసే వివాహిత మహిళపై అత్యాచారం హత్య ఘటన తీవ్రంగా ఖండించారు. మహిళను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నర్సరీల్లో పనిచేసే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.25 లక్షలు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఆమె పని చేసిన నర్సరీ యజమాని రూ.5 లక్షలు, నర్సరీ అసోసియేషన్ నుంచి మరో రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు తక్షణమే ఆ కుటుంబానికి సొంత ఇల్లు ఇవ్వాలని, కుమారుడికి చదువు పూర్తయ్యాక ఉద్యోగం ఇస్తామని కాకుండా తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, చదువును కొనసాగించే విధంగా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మృతురాలి కూతురు మానసిక, శరీరక వైకల్యంతో బాధపడుతూ తన పని తాను చేసుకోలేని స్థితి ఉందని, 21 సంవత్సరాల వయసులో వున్న ఆమె భద్రత కూడా ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మరిందని, ప్రభుత్వమే ఆమె బాధ్యతను స్వీకరించాలన్నారు. ఆమెకు పెన్షన్‌ని ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. మహిళపైన, చిన్నారులపైన రోజు రోజుకి అత్యాచారాలు హత్యలు పెరిగిపోతున్నాయని, వాటికి కారణమవుతున్న మాదక ద్రవ్యాలు, మద్యం, పోర్న్ వంటి వాటిని పూర్తిస్థాయిలో నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఆయా సంఘాల నాయకులు విజయగౌరి, వెంకటలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రజా సంఘాల నాయకులు అనిత, రాజేశ్వరి, పార్వతి, చిలుకూరి శ్రీనివాస్, అధ్యక్షులు జరీనా, సావిత్రి, సుజాత, వెంకటలక్ష్మి, మేరీ, సత్యవతి, సుబ్బలక్ష్మి, నాగమణి, పద్మ, పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కటింగ్, లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతకాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నగరంలోని కళా మందిర్, గోదావరి రైల్వే స్టేషన్ ఎదురుగా, కోట గుమ్మం, మెయిన్ రోడ్, చాంబర్ ఆఫ్ కామర్స్, నలం భీమరాజు వీధి, పప్పుల వీధి, సీతమ్మ సందు, ఆనప పిండి వారి వీధి, రంగ్రీజు పేట, మెయిన్ రోడ్డు, గుండువారి వీధి, ఖాజీ వీధి, పుష్కరఘాట్, కమిటీ హాలు, దాసరి వీధి, రంభ ఊర్వశి డౌన్, కంచుమర్తి వీధి, గొల్ల వీధి, మంగళవరపు పేట, ముత్తంగి వారి వీధి, కృష్ణుడి గుడి వీధి, పాత అన్నపూర్ణ థియేటర్, కుమ్మరి వారి వీధి, శ్యామలంబ రోడ్డు, మొదలగు ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ధవళేశ్వరం గ్రామం, అగ్రహారం, బ్యారేజ్ క్వాటర్స్, క్వారీ కెనాల్ రోడ్డు, శేఖర్ థియేటర్ రోడ్డు, ఎరకొండ, బత్తిన సుబ్బారావు కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ, ఎనోసాల్ట్ కంపెనీ, మంతెన సత్యనారాయణ ఆశ్రమం, ఎన్‌హెచ్ రోడ్డు, టీవీఎస్ ఏరియాలలో ప్రభావం ఉంటుందన్నారు.

ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో..

కడియం: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మురమండ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. మురమండ, దుళ్ళ, వీరవరం, పొట్టిలంక గ్రామాల పరిధిలోని వినియోగదారులు గమనించాలని తెలిపారు.

నేడు ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: వార్షిక మరమ్మతుల కారణంగా గురువారం ధవళేశ్వరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ధవళేశ్వరం అగ్రహారం, బ్యారేజ్ క్వార్టర్స్, క్వారీ కెనాల్ రోడ్, శ్రీలక్ష్మి థియేటర్ రోడ్, ఎర్రకొండ, బత్తిన సుబ్బారావు కాలనీ, ఇనోసాల్ట్ ఏరియా, మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం ఏరియా, ధవళేశ్వరం జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



విద్యార్థులకు హెల్మెట్ అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ద్విచక్ర వాహనాలు నడిపే వారందరూ ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ద్విచక్ర వాహనదారులకు ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్స్ పంపిణీ చేశామన్నారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాన్ని నడిపే వారందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. హెల్మెట్లు ధరిస్తే ప్రమాద తీవ్ర తగ్గుతుందన్నారు. గత నెల రోజులుగా ప్రజల్లో అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద బ్యాంకర్స్, హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఏపీ పేపర్ మిల్క్ యాజమాన్యాలతో సంప్రదించి వారి సహకారంతో హెల్మెట్ పంపిణీ ప్రక్రియకు జాబితాను సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ కళాశాలలో పేద విద్యార్థులకు, జూనియర్ అడ్వకేట్లకు గత 15 రోజులు క్రితం 148 హెల్మెట్లను అందించామన్నారు. స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో 250 హెల్మెట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, బార్ అసోసియేషన్ సెక్రెటరీ పి.రమేష్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాస్, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ జి.రఘుకుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కేవీఎస్ ప్రసాద్, ఆర్ట్స్ కళాశాల, ఉమెన్స్, ఎస్కేవీటీ కళాశాల విద్యార్థులు, జూనియర్ అడ్వకేట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి 174వ జయంతి సందర్భంగా మహిళా కళాశాలలో బుధవారం వివిధ పోటీలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పోటీల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచినట్టు ప్రిన్సిపాల్ రామచంద్రన్ ఆర్‌కే తెలిపారు. ఈ కార్యక్రమం వివిధ సంస్థల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులను ఒకచోట చేర్చి, స్నేహపూర్వక పోటీ, సహకారాన్ని పెంపొందించారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, డిబేట్లు, వక్తృత్వం, క్విజ్‌తోపాటు అనేక విభాగాలలో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యుత్ స్తంభం పాతేది ఇలాగేనా.!

- ప్రమాదాలు జరుగుతున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు





కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం, (అంతర చిత్రం) అడుగున మట్టి పూడ్చని వైనం

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా విద్యుత్ శాఖ అధికారుల్లో మాత్రం ఎటువంటి మార్పురావడం లేదు. కొత్త విద్యుత్ కనెక్షన్లు, కొత్తట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటులో చూపించే శ్రద్ధ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో సరైన పర్యవేక్షణ ఉండడం లేదు. దీనికి ఉదాహరణే బొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పాత బొమ్మూరు వడ్డి వీర భద్రనగర్‌లో రోడ్డుపై పాతిన విద్యుత్ స్తంభమే సాక్ష్యం. కొత్తగా వేసిన విద్యుత్ స్తంభంను పూర్తిస్థాయిలో కప్పిపెట్టకుండా వదిలేశారు. ఏ గాలివానలు వచ్చిన సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తే ఎవరూ బాధ్యత వహిస్తారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ట్యాక్సీ ఓనర్స్, వర్కర్స్ సంక్షేమానికి కృషి



రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న శ్రీనివాసరావు

- కన్నమాంబ ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు కేశవభట్ల

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రైల్వే స్టేషన్ ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్, కార్మికుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలతోపాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని కన్నమాంబ ట్యాక్సీ ఓనర్స్ అండ్ వెల్ఫేర్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం రాజమమేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సంక్షేమ సంఘం నూతన గౌరవాధ్యక్షుడిగా నియమితులు కావడంతో ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు కన్నమాంబ ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా మాన్యశ్రీ స్వర్గీయ కర్రి కృష్ణారెడ్డి విశేష కృషి చేశారన్నారు. ఆయన చూపిన మార్గంలో ట్యాక్సీ కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల పిల్లలకు విద్య, వైద్యం తదితర అంశాలలో పూర్తి సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజర్ రంగనాథ్, సీటీఐ సుంకర చంద్రమౌళి, ఆర్పీఎఫ్ ఇన్ స్పెక్టర్ సైదయ్య, ఆర్పీఎఫ్ ఎస్ఐ లక్ష్మి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, టీటీఐ సతీష్ బాబు, ట్రస్ట్ సభ్యులు ఏవీ నాగరాజు, చిటికెన సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, సంక్షేమ సంఘం బంగారయ్య, సెక్రటరీ రమేష్, ట్యాక్సీ ఓనర్లు ,డ్రైవర్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాబ్ మేళా

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరు కాగా 80 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పీ సురేష్ వర్మ హాజరై విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. జాబ్ మేళా నిర్వహించిన కళాశాల జె.కె.సి విభాగాన్ని, ఏహెచ్ కెరీర్ అకాడమీని ప్రిన్సిపాల్ అభినందించారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన కాతేటి యేసు

రాజమహేంద్రవరం రూరల్: అజాగ్రత్తగా, అతి వేగంగా అరటి పండ్ల బండిని వ్యాన్‌తో ఢీకొట్టడంతో అక్కడే ఉన్న ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యి మృతి చెందగా, మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం కంబాలచెరువు సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... క్వారీ సెంటర్ గాదిరెడ్డినగర్‌కు చెందిన కాతేటి యేసు(36) కాకినాడలోని రిలయన్స్‌స్మార్ట్ బజార్‌లో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తారు. వారానికి ఒకసారి ఇంటికి వచ్చి వెళుతుంటాడు. ఈనెల 5వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలోని ఇంటికి వచ్చాడు. తిరిగి బుధవారం ఉదయం 9 గంటల సమయంలో కాకినాడకు ఇంటి నుంచి బయలుదేరాడు. సుమారు 10 గంటల సమయంలో కంబాలచెరువు సెంటర్ స్వతంత్ర్య పెట్రోలు బంకు సమీపంలో అరటిపండ్లు బండి వద్ద ఆగి పండ్లు కొంటున్నాడు. ఈలోగా వ్యాన్ డ్రైవర్ అతి వేగంగా అరటి పండ్ల బండిని ఢీకొన్నాడు. అక్కడే ఉన్న కాతేటి యేసు మృతిచెందగా, రామలింగేశ్వరరావుకు స్వల్పగాయాలయ్యాయి. కాతేటి యేసు భార్య శాంతి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబర్ 8న రాజమహేంద్రవరంలో ఉద్యోగుల మహాసభ

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్‌వర్మ



ఉద్యోగుల మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గిరిప్రసాద్‌వర్మ, విల్సన్‌పాల్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ తీర్మానం మేరకు ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీన ఉద్యోగుల మహాసభ నిర్వహిస్తున్నట్టు సంఘజిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన అధ్యక్షతన సంఘ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిసెంబరు 8వ తేదీన నిర్వహించే ×ఉద్యోగుల మహాసభ× కరపత్రాలను, డోర్ స్టిక్కర్లు, ఆహ్వాన పత్రాలను సంఘ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఒక బలమైన శక్తిగా ఉందన్నారు. ఈ సంఘంపై ఉద్యోగులు ఆదరణ బాగుందన్నారు. డిసెంబరు 8న రాజమహేంద్రవరంలో ఉద్యోగుల మహాసభను ఉద్యోగులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ సీహెచ్ఎస్ విల్సన్ పాల్, జిల్లా ఉపాధ్యక్షుడు చాంబర్లీన్ మాట్లాడుతూ ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులు, ఉన్నతాధికారులు ఈసభలో పాల్గొనున్నారన్నారు. జిల్లా కోశాధికారి కాకర్ల వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, శ్రీనివాసరావు, భద్రా, రమేష్, ఎస్.నాగేశ్వరరావు, సత్యనారాయణరాజు, రవికుమార్ తదితరులు సభలో మాట్లాడారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, రాజమండ్రి అర్బన్, రూరల్, అనపర్తి, కోరుకొండ తాలూకా శాఖల ఏపీజీఈఏ నాయకులు పాల్గొన్నారు.